

నేడు భీమవరంలో అల్లూరి శతవర్ధంతి సభ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి సందర్భంగా గురువారం జువ్వలపాలెం రోడ్డులో ఉన్న అల్లూరి విగ్రహం వద్ద శతవర్ధంతి సభ నిర్వహిస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు బి.బలరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ సభ జరుగుతుందని, సభలో ప్రధాన వక్తగా ప్రజాశక్తి మాజీ సంపాదకులు, రాష్ట్ర రైతు నాయకులు వి.శ్రీనివాస్‌రావు పాల్గొనున్నారని తెలిపారు. అలాగే ఉభయగోదావరి జిల్లాల ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి)తోపాటు, రాష్ట్ర విభజన హక్కుల పోరాట నాయకులు, మేధావుల ఫోరం అధ్యక్షులు చలసాని శ్రీనివాస్‌తో పాటు పలువురు మేధావులు, వక్తలు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజానీకం తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

పంట రుణాల టార్గెట్ ఏదీ..!



- కొత్త ప్రభుత్వంపై కౌలురైతులు గంపెడాశలు
- కౌలురైతులకు పంట రుణాల మంజూరుపై చర్యలు కరువు
- బ్యాంకర్ల కమిటీ సమావేశం జరిపి టార్గెట్లు ఇచ్చేనా?
- రెండు జిల్లాల్లో మూడు లక్షల మంది ఎదురుచూపు
- కౌలు కార్డుల జారీలోనూ కొరవడిన చర్యలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కౌలు రైతులకు పంట రుణాల మంజూరులో బ్యాంకర్లకు టార్గెట్ విధించి కొత్త ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. గత ప్రభుత్వంలో కౌలు రైతుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం కొనసాగిందని, కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేస్తుందని రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్న పరిస్థితి నెలకొంది. పశ్చిమ, ఏలూరు జిల్లాల వ్యాప్తంగా ఖరీఫ్‌లో 4.30 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. రెండు జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది కౌలు రైతులు ఉండగా, వ్యవసాయ సాగులో 70 శాతానికిపైగా వీరే చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అత్యధికంగా కౌలు రైతులు ఉన్న జిల్లాలు ఇవే. తాము అధికారంలోకి వస్తే కౌలు రైతులకు న్యాయం చేస్తామంటూ టిడిపి కూటమి హామీ ఇచ్చింది. దీంతో కౌలు రైతులంతా కూటమి అభ్యర్థులకు ఓట్లేసి జిల్లాలో అన్ని సీట్లు కట్టబెట్టారు. అంతేకాకుండా డిప్యూటీ సిఎం, జనసేన అధినాయకుడు పవన్‌కల్యాణ్ తన ప్రసంగంలో ఎక్కువగా కౌలురైతుల గురించి మాట్లాడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పంటలు పండక అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకున్న కౌలు రైతులకు పవన్‌కళ్యాణ్ తన సొంత సొమ్ములు వెచ్చించి ఆర్థిక సాయం అందించడం అందరికీ తెలిసిందే. ఇప్పుడు ఆయనే ప్రభుత్వంలో కీలక స్థానంలో ఉండడంతో కౌలు రైతులలు మరిన్ని ఆశలు పెట్టుకున్న పరిస్థితి ఉంది. ఏటా బ్యాంకర్ల కమిటీ సమావేశం పెట్టి ఈ ఆర్థిక సంవత్సరంలో పంట రుణాలు ఎంత మేర మంజూరు చేయాలి. కౌలు రైతులకు ఎన్ని కోట్ల రుణాలు ఇవ్వాలనే దానిపై ప్రభుత్వం టార్గెట్లు పెడుతుండడం జరుగుతోంది. ఇప్పటివరకూ రెండు జిల్లాల్లోనూ కౌలు రైతులకు ఈ ఏడాది ఇచ్చే పంట రుణాలపై టార్గెట్లు విధించిన పరిస్థితి లేకుండా పోయింది. బ్యాంకర్లు కౌలు రైతులకు రుణాలు ఇచ్చేందుకు ముందుకు రాకపోవడం ఏటా కొనసాగుతోంది. 2014-2019 మధ్యకాలంలో టిడిపి ప్రభుత్వం కౌలు రైతులకు రుణాల మంజూరులో ప్రత్యేక చర్యలు తీసుకుంది. దీంతో కొంతమేర రైతులకు మేలు జరిగింది. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత కౌలు చట్టంలో భూ యజమాని అంగీకారంతోనే కౌలు కార్డులు జారీ చేయాలని నిబంధనలు విధించింది. దీంతో కౌలు కార్డులు జారీతోపాటు, పంట రుణాల మంజూరు సైతం అంతంతమాత్రం అన్నట్లుగా పరిస్థితి మారిపోయింది. దీంతో కౌలురైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కౌలు కార్డులు ఇవ్వకపోవడంతో పంట రుణంగానీ, ప్రభుత్వం అందించిన రైతు భరోసా, దెబ్బతిన్న పంటలకు సాయం, బీమా వంటివి ఏ ఒక్కటీ కౌలు రైతులకు అందలేదు. చివరికి పండించిన పంటను సైతం భూ యజమాని పేరున అమ్మాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో కౌలురైతుల పరిస్థితి అధ్వానంగా మారింది.

కౌలు కార్డుల జారీ.. పంట రుణాలు ఇచ్చేదెప్పుడు..!

ఏప్రిల్‌లో ప్రారంభం కావాల్సిన కౌలుకార్డుల జారీ ప్రక్రియ ఎన్నికల నేపథ్యంలో జరగలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడి రోజులు గడుస్తున్నా ఇప్పటికీ కౌలు కార్డులు జారీ వేగంగా ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. రెండు జిల్లాల్లో ఇప్పటివరకూ పట్టుమని రెండు వేల కౌలు కార్డులు కూడా జారీ కాకపోవడం అందుకు నిదర్శనంగా చెప్పొచ్చు. ప్రస్తుతం ఖరీఫ్ సాగు ముమ్మరంగా సాగుతోంది. మెట్ట ప్రాంతంలో నాట్లు, డెల్టాలో నారుమడుల పనుల్లో రైతులు మునిగి తేలుతున్నారు. వ్యవసాయానికి పెట్టుబడులు అత్యంత అవసరం. వెంటనే కౌలుకార్డుల జారీ ప్రక్రియ పూర్తిచేసి, బ్యాంకుల నుంచి పంట రుణాలు మంజూరు చేపట్టాలని కౌలు రైతులు కోరుతున్నారు. కొత్త ప్రభుత్వం ఆ విధంగా దృష్టి సారిస్తేనే కౌలురైతులకు న్యాయం జరిగే పరిస్థితి ఉంటుంది.



సమావేశంలో మాట్లాడుతున్న ఆక్వా రైతులు

ఆక్వా రైతులు పోరాటానికి సిద్ధం కావాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్రంలో ఆక్వా రైతుల న్యాయమైన డిమాండ్లను ప్రాసెసింగ్ యూనిట్లు, సీడ్, ఫీడ్ కంపెనీలు నెరవేర్చడానికి ముందుకు రావడం లేదని, దీంతో ఆక్వా రైతులు సమైఖ్యంగా పోరాటానికి సిద్ధం కావాలని జై భారత్ ఆక్వా రైతు సంఘం రాష్ట్ర సమావేశం పిలుపునిచ్చింది. ఈ మేరకు పాలకొల్లు ఎస్ఎస్ఎస్ కళ్యాణ మండపంలో గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు అధ్యక్షులుగా బుధవారం వివిధ జిల్లాల రైతులతో సమావేశం నిర్వహించారు. ఆక్వా రంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లక్షల కోట్ల ఆదాయం వస్తున్నా ఆక్వా రైతులకు రాయితీలు ఇవ్వడం లేదని సమావేశం ఆవేదన వ్యక్తం చేసింది. తొలుత జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును తరువాత అచ్చెన్నాయుడును, సిఎం చంద్రబాబును కలిసి తమ గోడు వినిపించాలని నిర్ణయించారు. పంట పండించే రైతులు తప్ప ఆక్వాపై ఆధారపడిన సీడ్, ఫీడ్, ప్రాసెసింగ్, రొయ్యలు కొనే దళారీలు, ఇలా అందరూ బాగున్నారని సమావేశంలో పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. అవసరమైతే క్రాప్ హాలిడేకు సిద్ధం అని హెచ్చరించారు. రైతులు ఏటా నష్టాల ఊబిలో కూరుకుపోతుంటే ఎంపెడా ఏం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్వా రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని రైతులు నినాదాలు చేశారు. గుజరాత్ ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను రాష్ట్రంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి బోనం చినబాబు, ఉపాధ్యక్షులు కోడి విజయభాస్కర్, మేడిది జాన్ రాజు, పెన్మెత్స సత్యనారాయణ రాజు, కోడి విజయభాస్కర్, గొట్టుముక్కల సూర్య నారాయణరాజు, రుద్రరాజు సత్యనారాయణ రాజు, కర్నేన గౌరునాయుడు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

27వ రోజుకు సిపిఎఫ్ కార్మికుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగ, కార్మికులు

ప్రజాశక్తి - గణపవరం

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎఫ్ ఫ్యాక్టరీ ఉద్యోగ, కార్మికులు చేపట్టిన నిరసన 27వ రోజు బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇన్ని రోజులుగా నిరసన తెలుపుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. సమస్యను పరిష్కరించాలని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు అందించినా తమ సమస్య పరిష్కారానికి ముందుకు రాకపోవడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో తమ ఓట్ల కోసం ఇంటింటికీ తిరిగిన ప్రజాప్రతినిధులు తమ ఉద్యోగ భద్రత కోసం వినతిపత్రం అందజేసినా పట్టించుకోలేదన్నారు. నూతన ప్రభుత్వంలో అయినా తమ సమస్య పరిష్కారం జరుగుతుందని ఆశిస్తుంటే తమ ఆశలు అడియాసలు అవుతున్నాయన్నారు. తమ సమస్య పరిష్కరించే వరకూ సిఐటియు ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఫ్యాక్టరీ తెరిచే వరకూ తమ ఉద్యోగ భద్రత కల్పించే వరకూ పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

ఏటిగట్టు పటిష్టతకు చర్యలు

జిల్లా కలెక్టర్ నాగరాణి



ఏటిగట్టు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం వశిష్ట గోదావరి ఏటిగట్టు పటిష్టం చేయడంతో పాటు, వరదలొస్తే సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని చర్యలూ చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ సి.నాగరాణి తెలిపారు. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న అనంతరం తొలిసారిగా నరసాపురం విచ్చేసిన కలెక్టర్ నాగరాణి వశిష్ట గోదావరి ఏటిగట్టు పనులను బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఏటిగట్టు పనులపై ఇరిగేషన్ అధికారులను ఆరా తీసి పలు సూచనలు చేశారు. గతంలో కోతకు గురైన ప్రదేశాన్ని ఆమె స్వయంగా పరిశీలించారు. అనంతరం విలేకరులతో కలెక్టర్ మాట్లాడుతూ నరసాపురం నియోజకవర్గంలో జల వనరుల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న డ్రెయినేజీ పనులను పర్యవేక్షించినట్లు తెలిపారు. పూర్తినాణ్యతతో నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. ఏటిగట్టు పటిష్ట పనులు చాలా వరకూ పూర్తయ్యాయన్నారు. 2022లో 22 లక్షల క్యూసెక్కుల వరద నీరు ఆకస్మికంగా రావడంతో ఏటిగట్టుకు గండి పడిందన్నారు. ఆనాటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఒక వేళ 25 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చినా తట్టుకునే విధంగా ఏటిగట్టు పటిష్టతకు పనులను చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే రూ.24 కోట్ల వ్యయంతో 250 మీటర్ల రివిట్మెంట్ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం జులైలో వరదలు, అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పనుల్లో నాణ్యతను చెక్ చేసి నిర్మాణాలు జరుపుతున్నామన్నారు. జిల్లా కలెక్టర్ వెంట ఆర్‌డిఒ ఎం.అచ్యుత్ అంబరీష్, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, తహశీల్దార్ ఎన్ఎస్ఎస్.ప్రసాద్, వశిష్ట సబ్ డివిజన్ డిఇ గంగుమల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు విద్యాసంస్థల బంద్‌కు సిపిఎం మద్దతు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఈ నెల 4న విద్యార్థి సంఘాలు నిర్వహిస్తున్న దేశ వ్యాప్త విద్యా సంస్థల బంద్‌కు సిపిఎం జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలిపింది. ఈ మేరకు బుధవారం సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రుల జీవితాలతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆటలాడుకుంటోందని విమర్శించారు. నీట్, నెట్ ప్రశ్నా పత్రాల లీక్‌పై సమగ్ర విచారణ చేయాలని, కేంద్ర విద్యాశాఖా మంత్రి రాజీనామా చేయాలని బలరాం డిమాండ్ చేశారు. విద్యార్థుల బంద్‌కు అందరు సహకరించాలని కోరారు.

విద్యాసంస్థల బంద్‌కు సంపూర్ణ డివైఎఫ్ఐ మద్దతు

కేంద్రంలో నీట్ పరీక్షా ఫలితాల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యా శాఖా మంత్రి తక్షణం రాజీనామా చేయాలని కోరుతూ దేశంలోని ప్రజాతంత్ర విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల నాలుగో తేదీన జరగనున్న కేజీ - పీజీ విద్యాసంస్థల బంద్ పిలుపునకు డివైఎఫ్ఐ జిల్లా సంపూర్ణ మద్దతు తెలిపినట్లు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌విఎన్.శర్మ, గేదెల ధనుష్ బుధవారం ప్రకటనలో తెలిపారు. మోడీ ప్రభుత్వ హయాంలో ఇప్పటికే 65 సార్లు పరీక్ష పేపర్లు లీకయ్యాయని పేర్కొన్నారు. దీంతో దేశంలో లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారైందని తెలిపారు. తక్షణం నీట్ పేపర్ లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్‌చేశారు. విద్యాసంస్థల బంద్‌కు అన్ని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యార్థులు, తల్లిదండ్రులు సహకరించి బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

లేస్ సెంటర్ల ద్వారా ఉపాధి అవకాశాలు

లేసు ఉత్పత్తులను పరిశీలించిన కలెక్టర్ నాగరాణి



లేస్ ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - నరసాపురం

లేస్ సెంటర్ల ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి, ప్రభుత్వపరంగా కావలసిన సౌకర్యాలను కల్పిస్తామని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. బుధవారం నరసాపురం మండలం సీతారాంపురం(సౌత్) అలంకృతి లేసుపార్కును, రుస్తుంబాధ అంతర్జాతీయ లేస్ ట్రెడ్ సెంటరును పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ సి.నాగరాణి పరిశీలించారు. తొలుత లేసు పార్క్ మేనేజరు ఎస్.కుసుమ కుమారి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం లేసు ఉత్పత్తికి సంబంధించిన వివరాలు జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రతి రూమ్‌లోని లేసు ఉత్పత్తులను, అల్లికలు పరిశీలించి ఆమె ముగ్ధులయ్యారు. లేసు ఉత్పత్తులు మార్కెటింగు, వివిధ రకాల డిజైన్‌లను అడిగి తెలుసుకున్నారు. లేసు అల్లికలు అల్లే మహిళలతో జిల్లా కలెక్టర్ మమేకమై, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రవాణా, మార్కెటింగు, ఆధునిక టెక్నాలజీ డిజైన్లు, స్టాఫ్ సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ఆమె సానుకూలంగా స్పందించారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం అంటేనే లేస్ అని, లేసు ఉత్పత్తులంటేనే నరసాపురం అని జిల్లా కలెక్టరు అన్నారు. నరసాపురంకు లేసు అల్లికలు తయారీలో ప్రత్యేక ప్రాముఖ్యత ఉందని ఆ ప్రాముఖ్యత తగ్గడం, మార్కెటింగు రంగంలో ఉన్న సదుపాయాలను, క్రొత్త డిజైన్లు అందించడంలో లోపం వంటి అంశాలను గుర్తించడం జరిగిందని ఆమె అన్నారు. ఈ రంగం అభివృద్ధికి ప్రభుత్వ పరంగా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ యం.అచ్యుత్ అంబరీష్, డిఆర్‌డిఎ పిడి ఎంఎంఎస్ వేణుగోపాల్, తహశీల్దారు ఎన్ఎస్ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

డిజిటల్ కమ్యూనిటీ భవనం పరిశీలన : కలెక్టర్

కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ దత్తత గ్రామం పెద మైనవానిలంకలోని డిజిటల్ కమ్యూనిటీ భవనాన్ని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి పరిశీలించారు. బుధవారం నరసాపురం మండలం పెదమైనవానిలంక గ్రామంలోని డిజిటల్ కమ్యూనిటీ భవనాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. డిజిటల్ భవన్‌లో జరుగుతున్న శిక్షణలను పరిశీలించారు. డిజిటల్ భవన్ ఎప్పుడు ప్రారంభించారు, ఇప్పటి వరకు ఏఏ శిక్షణలను ఎంతమంది తీసుకోవడం జరిగిందని, శిక్షణ పొందిన వారి ప్లేస్మెంట్స్, తదితర వివరాలను డిజిటల్ భవన్ నిర్వాహకులను జిల్లా కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా ఎంత మంది శిక్షణ పొందారు, ప్రస్తుతం ఎన్నో బ్యాచ్ నడుస్తుందని తెలుసుకొని, వారికి శిక్షణ అనంతరం అందించే టూల్ కిట్స్, శిక్షణ కాలంలో అందించిన స్టైఫండు వివరాల రిజిస్టర్లును, కంప్యూటర్ల డేటాను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట నరసాపురం ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్, డిఆర్‌డిఎ పిడి ఉన్నారు.

గోదావరిలో చెత్త తొలగింపు

నరసాపురంలో జిల్లా కలెక్టర్ నాగరాణి పర్యటనతో గోదావరి తీరాన ఉన్న చెత్తను బుధవారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. అమరేశ్వర ఘాట్ సమీపంలో కరకట్టపై నుంచి గోదావరిలో చెత్త వేయడంతో కొద్దిరోజులుగా అధ్వాన్నంగా కనిపిస్తుంది. కలెక్టర్ వస్తున్నారని సమాచారంతో మున్సిపల్ సిబ్బంది ఆఘమేఘాల మీద అక్కడ శుభ్రపరచడం స్థానికులకు ఆశ్చర్యానికి గురిచేసింది. గోదావరి తీరంలో చెత్త వేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

అల్లూరు ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

వర్ధంతి సభలో వక్తలు



భీమవరం టౌన్ : నివాళులర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

అందరితో ఆప్యాయంగా పిలువబడే వ్యక్తి అల్లూరు అని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, కార్మికోద్యమ నేత అల్లూరు సత్యనారాయణ దశ వర్ధంతి కార్యక్రమం మెంటేవారితోటలోని స్థానిక సుందరయ్య భవనం వద్ద జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బి.బలరాం మాట్లాడుతూ చనిపోయే ముందు వరకు ఎర్రజెండా ఇచ్చిన స్ఫూర్తితో పేదల పక్షపాతిగా నిలిచిన వ్యక్తి అల్లూరు అని కొనియాడారు. సమసమాజ స్థాపనే ధ్యేయంగా అంకిత భావంతో కృషిచేసిన ఆయన ఆశయ సాధనకు పునరంకితమవ్వాలని బి.బలరాం కార్యకర్తలకి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, సభ్యులు వడగు వెంకటేశ్వరరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, జి.రఫాయేలు, విజయకుమారి పాల్గొన్నారు.

పాలకొల్లు : కార్మికోద్యమ నేత, సిపిఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ అల్లూరు సత్యనారాయణ జీవితం ఆదర్శనీయమని మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన 10వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తొలుత అల్లూరు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చల్లా సోమేశ్వరావు, వై.అజయ్ కుమార్, వేగి రత్తయ్య జి.వెంకటేష్, మల్లుల లక్ష్మీనారాయణ, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

పెనుగొండ : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అభివృద్ధికి విశేష కృషిచేసిన కార్మిక నాయకుడు అల్లూరు సత్యనారాయణ 10వ వర్ధంతి పెనుగొండలో నిర్వహించారు. ముందుగా మండల కమిటీ సభ్యులు అల్లూరు ఆశయ సాధనకు కృషి చేస్తామని ప్రతినపూని, పూలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు, నీలాపు ఆదినారాయణ, నాగిశెట్టి గంగారావు, శీలం ఏసు, బొల్లోజు నేతాజీ, పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: అల్లూరు సత్యనారాయణ ప్రముఖ రాజకీయవేత్తని, స్వయంకృషితో రాజకీయాల్లో ఉన్నతస్థాయికి ఎదిగారని పలువురు పేర్కొన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సిఐటియు వ్యవస్థాపకుడు, సిఐటియు ఉద్యమ నిర్మాత అల్లూరు సత్యనారాయణ 10వ వర్ధంతి సభ స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో జవ్వాది శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా అల్లూరు సత్యనారాయణ చిత్ర పటానికి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, పెంటపాడు మండల కన్వీనర్ చిర్ల పుల్లారెడ్డిలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెట్టుపై మెట్టు ఎదగడంలోనూ, రాజకీయ వ్యూహచతురతలోనూ ఆయన అత్యంత అరుదైన వ్యక్తిగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీను, సత్తి కోదండ రామిరెడ్డి, చల్లా చంద్రరావు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తణుకు: కార్మికవర్గ రాజ్యం కోసం జీవితాంతం పోరాటం సాగించిన వ్యక్తి అల్లూరు సత్యనారాయణ అని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ అన్నారు. బుధవారం స్థానిక అమర వీరుల భవనం వద్ద, వాన్ బరి పరిశ్రమ వద్ద అల్లూరు సత్యనారాయణ 10వ వర్ధంతిని సిఐటియు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జోహార్ అల్లూరు సత్యనారాయణ, సాధిస్తాం అల్లూరు సత్యనారాయణ ఆశయాలను అని నినాదాలు చేశారు. తొలుత అల్లూరు చిత్ర పటానికి ప్రతాప్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గార రంగారావు, పి.దక్షిణా మూర్తి, ఎన్.ఆదినారాయణ బాబు, రమేష్, మందులయ్య పాల్గొన్నారు.

పెంటపాడు: అల్లూరు సత్యనారాయణ పదవ వర్ధంతి సభ తాడేపల్లిగూడెం రైల్వేగూడ్స్ వర్కర్స్ యూనియన్ వద్ద నిర్వహించారు. ముందుగా అల్లూరు చిత్రపటానికి యూనియన్ అధ్యక్షులు సత్తి కోదండరామిరెడ్డి, యూనియన్ కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కర్రీ సాయి రెడ్డి, ఆకుల నారాయణ, ఆడప ఆంజనేయులు, కర్రి సుబ్బిరెడ్డి, కర్రి శ్రీనివాస్ రెడ్డి, బుద్దాల నాని, అడ్డగర్ల కృష్ణ పాల్గొన్నారు.

ఆకివీడు : ఆశయాల సాధనకు పోరాటమే ఆయుధంగా స్వీకరించిన వ్యక్తి అల్లూరి సత్యనారాయణ అని సిపిఎం పట్టణ కార్యదర్శి కె.తవిటి నాయుడు అన్నారు. అల్లూరి సత్యనారాయణ రాజు పదవ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు ఘటించారు. డోకల రవితేజ, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

వెంప శ్మశాన భూ వివాదాన్ని పరిష్కరించాలి


ప్రజాశక్తి - భీమవరం టౌన్

మండలంలోని వెంప గ్రామపంచాయతీలోని దళితవాడపెద్ద పేటలో దళితులకు సంబంధించిన ఎకరా 94 సెంట్లు స్మశాన భూమి వివాదంపై ప్రభుత్వం బుధవారం పివి రావు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు గుమ్మాపు సూర్య వరప్రసాద్ వెంప దళితవాడని సందర్శించారు. స్మశాన భూమి అక్రమానికి గురైందని, అధికారులు ఇప్పటివరకు దానిపై పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఎవరైతే అగ్రవర్ణానికి చెందిన భూస్వామి ఉన్నారో వాళ్లకి కొమ్ముకాసే విధంగా ఉండటాన్ని తీవ్రంగా దయబెట్టారు. స్మశాన భూమిలో నుంచి రోడ్డు ఇవ్వాలని, స్మశాన భూమి ఎకరా 92 సెంట్లు సర్వే చేయించి, చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి దళితులకు వారి పేరు మీద స్మశాన భూమిని అప్పగించాలని తెలిపారు.

వెంప గ్రామపంచాయతీలో గల పెద్ద పేటకు చెందిన దళితులపై అర్ధరాత్రి 12 గంటలకు దాడి చేసిన వారిపై పిసి కమిటీ వేసి కఠినంగా శిక్షించాలని ఎస్‌సి ఎస్‌టి విజిల్ అండ్ మోనటరింగ్ కమిటీ మెంబర్ పొన్నమండ బాలకృష్ణ అన్నారు. బుధవారం గ్రామంలో దాడికి గురైన బాధితులను ఆయన పరామర్శించారు.

ప్రతి విద్యార్థీ సైంటిస్ట్, డాక్టర్‌గా ఎదగాలి

స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ కార్యక్రమంలో ఎంఎల్ఎ అంజిబాబు



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రతి విద్యార్థి ఒక సైంటిస్ట్‌గా, డాక్టర్, ఇంజనీర్‌గా ఎదగాలని, ప్రభుత్వం విద్యకు ఎన్నో సౌకర్యాలు కల్పిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) విద్యార్థులకు పిలుపునిచ్చారు. బుధవారం భీమవరం మండలం అన్నాకోడేరులోని డిఎన్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్కూల్ కిట్స్‌ను ఎంఎల్ఎ అంజిబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కష్టపడి చదువుకుంటే అన్ని సౌకర్యాలు ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. విద్యతోనే రాష్ట్ర అభివృద్ధి అని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదలతో విద్యను అభ్యసించాలని ఎంఎల్ఎ అంజిబాబు తెలిపారు. విద్యార్థులను బడికి పంపే బాధ్యత తల్లిదండ్రులపైనే ఉందని, డ్రాఫ్ట్ అనేది లేకుండా చూడాలని, ప్రతి విద్యార్థి తప్పకుండా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచి జుత్తిగ దుర్గప్రసాద్, ఉప సర్పంచి విశ్వేస్, నిర్మల కుమారి, గుడపాటి మిల్టన్, ఎంపిటిసి యర్రంశెట్టి వెంకటేశ్వరావు, దంతులూరి పల్లంరాజు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై చర్యలు తీసుకోవాలి

ఉండి: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ బాలికలను వేధిస్తున్న ఆకతాయి యువకులపై చర్యలు తీసుకోవాలని బుధవారం ఉండి గ్రామానికి చెందిన కొందరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఉండి ఎస్ఐ ఎం.లక్ష్మణ్ మాట్లాడుతూ ఉండి పాత పంచాయతీ ఆఫీస్ పరిసర ప్రాంతాల్లోనూ, స్టేషన్ రోడ్డు, వెలివర్రు రోడ్డు, రైల్వే గేట్ సమీపంలోని వాటర్ ట్యాంక్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిసర ప్రాంతాల్లో కొందరు యువకులు మత్తు పదార్థాలకు బానిసలై ఆ ప్రాంతాల్లోని ప్రజలకు పాఠశాలకు వెళ్లే బాలికలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ప్రశ్నించిన వారిపై దాడులకు పాల్పడుతూ అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని వెంటనే ఆ ప్రాంతాలలో పోలీసులు గస్తీ నిర్వహించి అటువంటి వారిపై తగు చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

పొలమూరులో 'బడికి పోతా'

పెనుమంట్ర: 'బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా మండలంలోని పొలమూరు శివారు నాగళ్లదిబ్బ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సమీప కాన్వెంట్లలో చదివే ఇద్దరు విద్యార్థులను చేర్చుకున్నట్టు మండల విద్యా శాఖాధికారి-2 ఉంగరాల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, జాతీయ బెస్ట్ టీచర్ అవార్డు గ్రహీత కెఎన్‌వి.శ్రీనివాస్ చొరవతో తల్లిదండ్రులను ఒప్పించి విద్యార్థులను చేర్చినట్టు ఆయన అన్నారు. పిల్లకు విద్యా కిట్స్ అందజేశారు. నాగల్లదిబ్బ పాఠశాలకు భవనం నిర్మించేటప్పుడు స్థలం ఇచ్చిన దాత కవురు వెంకన్న ముని మనవడు కౌశిక్ ప్రయివేటు కాన్వెంట్ చదువుతుండడం గమనించి ఆ బాలుని తల్లితండ్రులను, మరో విద్యార్థి భవానీలను వారి తల్లితండ్రులను ఒప్పించి నాగల్లదిబ్బ పాఠశాలలో చేర్పించడం జరిగిందని ఎంఇఒ-1 వెల్లడించారు.

ఎస్‌విఆర్‌కు భారతరత్న ఆమోదయోగ్యం : బొలిశెట్టి

తాడేపల్లిగూడెం: సహజనటుడు ఎస్‌వి రంగారావుకు భారతరత్న ఆమోదయోగ్యమైన కోరికని, దానికి తన మద్దతు ఎప్పటికీ ఉంటుందని తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలోని హౌసింగ్ బోర్డు ఎస్‌విఆర్ సర్కిల్ వద్ద ఎస్‌వి రంగారావు జయంతి వేడుకలు ఎస్‌విఆర్ సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముందుగా ఎస్‌విఆర్ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ మహానటుడు ఎస్‌వి రంగారావుకి ఎన్ని అవార్డులు ఇచ్చినా తక్కువేనని, ఆయనను మించిన నటుడు సినీ రంగంలో రాలేదని కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు నరసి సోమేశ్వరరావు, మార్నీడి బాబ్జి పాల్గొన్నారు.

గాంధీ సేవలు ప్రశంసనీయం..

ఆచంట: ఆచంట తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ఇంజేటి గాంధీ సేవలు ప్రశంసనీయమని తహశీల్దార్ ఐపీశెట్టి అన్నారు. పదవీవిరమణ చేసిన సీనియర్ అసిస్టెంట్ ఇంజేటి గాంధీ, విజయలక్ష్మి దంపతులను స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ కళ్యాణ మండపంలో మంగళవారం రాత్రి ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఐపీశెట్టి మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో అత్యంత అనుభవం ఉన్న వ్యక్తి గాంధీ అని కొనియాడారు. 42 సంవత్సరాల పాటు ఒక్క మెమో కూడా తీసుకోకుండా రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో విశిష్ట సేవలు అందించి, పలువురు చేత మన్ననలు పొంది, వృత్తిలో అంకితభావంతో పనిచేసి పదవీ విరమణ చేసిన గాంధీ ఆదర్శప్రాయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పి.నరసింహ ప్రసాద్, పెనుగొండ తహశీల్దార్ అరవింద్,రోహిణి దేవి పాల్గొన్నారు.

వ్యవసాయ పరిశోధనా స్థానం సందర్శన

పెనుమంట్ర : ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం పరిశోధనా సంచాలకులు డాక్టర్ పాలడుగు సత్యనారాయణ స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానాన్ని సందర్శించారు. గతంలో మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఎడిఆర్‌గా పనిచేసే కొద్దిరోజుల క్రితం ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ పరిశోధనా సంచాలకులుగా ఆయన ఉద్యోగోన్నతి పొందారు. ఈ పరిశోధనా స్థానం సందర్శన సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నిడదవోలు రామానాయుడు, ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ ఆయనను గౌరవ సూచకంగా కలిసి మార్టేరు పరిశోధనా స్థానం వంద సంవత్సరాలు పూర్తిచేసుకొని శతవసంతోత్సవాలు నిర్వహించుకుంటున్న తరుణంలో, ప్రభుత్వ పరంగా సంపూర్ణ సహాయ సహకారాలు అందించాలని కోరారు.

గుండెపోటుతో సిసిఎస్ ఎస్ఐ మృతి

భీమవరం టౌన్: భీమవరంలోని సిసిఎస్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్న నాగేశ్వరరావు మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందిన ఘటన భీమవరంలో చోటుచేసుకుంది. సంబంధించిన వివరాల ప్రకారం.. భీమవరం సిసిఎస్ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న నాగేశ్వరరావు(62) మంగళవారం రాత్రి విధులు ముగించుకుని ఆయన ఉంటున్న ప్రతి అపార్ట్‌మెంట్ వద్దకు వచ్చారు. కారు దిగి ఇంట్లోకి వెళ్లకుండానే ఆయనకు గుండెపోటు రావడంతో కారులోనే మరణించారు. తెల్లవారుజాము అయినా ఎస్ఐ ఇంటికి రాలేదని ఆయన భార్య సిబ్బందికి ఫోన్ చేయడంతో సారు వచ్చేసారని చెప్పడంతో ఆయన్ను కింద కారులో మృతిచెంది ఉండటం గమనించారు. ఆయన మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు పోస్టుమార్టం తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌పి అజిత వెజెండ్ల, అడిషనల్ ఎస్‌పి భీమారావు వచ్చి నివాళులర్పించారు. అయితే నాగేశ్వరరావు ఈ నెలాఖరుకి రిటైర్మెంట్ అవుతారని, ఇలాంటి సమయంలో ఆయన్ని ఇలా చూడటం బాధాకరమని సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలకు 13 మంది ఎంపిక

పాలకొల్లు : దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన ప్రాంగణ ఎంపికలో టెక్నో టాస్క్, బిజినెస్ సొల్యూషన్స్ విజయవాడలో పనిచేయుటకు ఎంపికైన 13 మంది విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శోభారాణి అభినందించారు.

పంటు స్వాధీనం

నరసాపురం: నరసాపురం మాధవాయిపాలెం-సఖినేటిపల్లి ఫెర్రీ రేవులను బుధవారం నుంచి మండల పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లును పూర్తి చేసినట్లు ఎంపిడిఒ ఎంవి రమణారావు తెలిపారు. పంటును స్వాధీనం చేసుకుని మండల పరిషత్ ఆధ్వర్యంలో సచివాలయం సిబ్బందితో రేవు నిర్వాహణ చేపట్టారు.

ఎంఎల్‌ఎ నివాసం వద్ద ప్రజా దర్బార్

తాడేపల్లిగూడెం: చిన్న చిన్న సమస్యలు ఉంటే వాటిని వాయిదా వేయకుండా వెంటనే పరిష్కరించాలని ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ నివాసం వద్ద బుధవారం ఉదయం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడికి విచ్చేసిన ప్రజలు మంచినీరు, పారిశుద్ధ్యం, గత ప్రభుత్వం కేటాయించిన కాలనీలోని సమస్యలు ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకువెళ్లారు. ఎంఎల్‌ఎ సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

రైతులకు సేవలందించాలి

తణుకు : రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలు అందించాలని తణుకు నియోజకవర్గ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక కార్యాలయం వద్ద తణుకు నియోజకవర్గ వ్యవసాయ శాఖ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం వ్యవసాయశాఖ సిబ్బంది ఆరిమిల్లి రాధాకృష్ణని సత్కరించారు.

మొబైల్ యాప్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

విద్యుత్ శాఖ డిఇ బి.సురేష్ కుమార్

నరసాపురం: ఎపిఇపిడిసిఎల్ మొబైల్ యాప్, వెబ్‌సైట్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని నరసాపురం విద్యుత్ శాఖ డిఇ బి.సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌బిఐ మార్గదర్శకాలను అనుసరించి ఫోన్‌పే, గూగుల్ పే, పేటిఎం, ఇతర యూపిఐ యాప్‌లో బిల్లులు చెల్లించేటప్పుడు ఎపిఇపిడిసిఎల్ పేరు కనిపించదని, కనుక వినియోగదారుల సంస్థ మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని చెల్లింపులు చేయాలన్నారు. బిల్లులు చెల్లించేటప్పుడు ఫోన్‌పే, గూగుల్ పే, పేటిఎం, ఇతర యాప్లు, క్రెడిట్ నెట్ బ్యాంకింగ్ వాడుకోవచ్చని వివరించారు.

ఉప్పుటేరు పరిశీలన

మొగల్తూరు : ఉప్పుటేరు మొగ పూడిక తీత పనులకు సంబంధించి తక్షణం ప్రతిపాదనలు తయారుచేసి సమర్పించాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం మొగల్తూరు మండలం మోళ్లపర్రు వద్ద ఉప్పుటేరు ఏటి మొగ సముద్రంలో కలిసే ప్రాంతాన్ని ఆమె సందర్శించి పరిశీలించారు. ఆకివీడు మండలం దుంపగడప నుంచి 64 కిలోమీటర్లు ప్రవహించి మొగల్తూరు మండలం మోళ్ల పరువు వద్ద సముద్రంలో కలిసే ఈ ఉప్పుటేరు పరివాహక ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. సుమారు ఎనిమిది లక్షల ఎకరాల పరివాహక ప్రాంతం నుంచి వచ్చిన మురుగు, వర్షపు నీటిని ఉప్పుటేరు ద్వారా ప్రవహించి కొల్లేరు సరసు అవుట్లెట్ బయటకు ప్రవహించే ఏకైక ద్వారం ఉప్పుటేరని అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఉప్పుటేరు మొగ పూర్తిగా ఇసుక మేటలతో పూడుకు పోవటం వల్ల వర్షాకాలంలో దీని పరివాహక ప్రాంత ఆయుకట్టు ముంపుకు గురి అవుతుందని, డ్రెయినేజీ శాఖ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ ఏటి మొగ దగ్గర పూడికతీత పనులకు సంబంధించి తక్షణం ప్రతిపాదనలను తయారుచేసి సమర్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షునిపై దాడి

ప్రజాశక్తి - ఉండి

ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, ఉండి మండల మాజీ అధ్యక్షులు కనిగళ్ల బ్రహ్మానందంపై మంగళవారం సాయంత్రం కొందరు యువకులు దాడి చేశారు. ఈ దాడిని ఖండిస్తూ ఉండి ఆర్యవైశ్య సంఘం సభ్యులు బుధవారం తమ దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేసి బంద్ పాటించారు.

అల్లూరి పోరాట స్ఫూర్తి అనుసరణీయం

నేడు అల్లూరి శత వర్ధంతి సందర్భంగా..



'అల్లూరి సీతారామరాజు' ఆ పేరు వింటేనే ప్రపంచంలో ఎక్కడున్నా తెలుగువారి హృదయాలు పులకిస్తాయి. బ్రిటిష్ వారి దుర్మార్గాలకు, దోపిడీకి వ్యతిరేకంగా సాగిన మహోజ్వల స్వాతంత్ర్య పోరాటం, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో ఒక ముఖ్య ఘట్టం. 1922-24 సంవత్సరాల మధ్య మన్యంలో అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో జరిగిన సాయుధ తిరుగుబాటు బ్రిటిష్ సామ్రాజ్యవాదుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించాయి. 'మన్యం విప్లవం' భారత జాతీయోద్యమ చరిత్రలో ఒక మైలురాయిగా నిలచింది. సామ్రాజ్యవాద వ్యతిరేక స్ఫూర్తిని నింపింది. ఈ పోరాటం బ్రిటీషు సామ్రాజ్యవాదాన్ని ఓడించడానికి దోహదపడింది.

సీతారామరాజు చారిత్రక నేపథ్యం

పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు మండలం మోగల్లు గ్రామంలో ఒక సామాన్య రైతు కుటుంబంలో అల్లూరి సీతారామరాజు జన్మించారు. తెల్లదొరతనాన్ని ద్వేషించే కుటుంబ వారసత్వం ఉంది. ఒకరోజు తన తండ్రితో రాజమండ్రిలోని ఒక వీధిలో వెళుతుండగా ఎదురుగా వస్తున్న తెల్లదొరకు ప్రజలు చేతులెత్తి నమస్కరిస్తున్నారు. రామరాజు కూడా నమస్కరించబోయాడు. తండ్రి తీవ్రంగా మందలించి నివారించాడు. ఈ ఘటన సామ్రాజ్యవాదాన్ని, దొరతనాన్ని ద్వేషించడానికి బీజం వేసింది. ఒక నాటకంలో బహుమతిగా సీతారామరాజుకు కింగ్ జార్జి బొమ్మగల పతకం ఇచ్చారు. దాన్ని చొక్కాకు ఎందుకు తగిలించుకుని తిరుగుతున్నావని అడిగితే బ్రిటీషు వాడు మన గుండెలపై తిష్ట వేశాడు. అతన్ని పారద్రోలాలనే కర్తవ్యం నిత్యం గుర్తుండేందుకే ఇలా ధరిస్తున్నాను అని సమాధానం ఇచ్చాడు. బ్రిటిష్ పెత్తనం, క్రూరత్వంపై చిన్ననాడే నరనరాన జీర్ణించుకున్న ద్వేషం, పెంచుకున్న ఆగ్రహానికి, అనంతరం అకుంఠిత దీక్షతో నడిపిన పోరాటం చిరస్థాయిగా నిలిచింది. చరిత్రను హీరోలు సృష్టించారు. చారిత్రక, సామాజిక పరిస్థితులే అతి సామాన్యుడిని సైతం అసమాన వ్యక్తులుగా, ధైర్య సాహసాలతో పోరాడే యోధులుగా, హీరోలుగా తీర్చిదిద్దుతాయి. ఇది చరిత్ర చెప్పిన సత్యం. గాంధీజీని తొలుత ఎంతగా ప్రేమించినా ఆయన అహింసా పద్ధతుల వల్ల స్వరాజ్యం రాదని నమ్మిన అనేక మందిలో అల్లూరి ఒకడు. బెంగాల్ విప్లవకారులతో పరిచయాలు ప్రత్యేకించి మన్యంలో బ్రిటిష్ వాడి దోపిడీ, చిత్ర హింసలు పాలవుతున్న గిరిజనుల్ని, దేశాన్ని దాస్యశృంఖలాల నుంచి విముక్తి చేయాలనే మహత్తర ఆలోచనకు తెరతీశాయి. ఈ నేపథ్యంలోనే అల్లూరి అనే ఒక సాధారణ యువకుడు విప్లవ వీరుడయ్యాడు. 1917 సోవియట్ విప్లవ ప్రభావం కూడా అల్లూరిపై పడి ఉండొచ్చు.

మన్యం స్థితిగతులు - మన్య పోరాటం

అటవీ ప్రాంతంలో గిరిజనులు ఎక్కువగా పోడు వ్యవసాయం చేసేవారు. బ్రిటిష్ ప్రభుత్వం దీన్ని నిషేదిస్తూ రిజర్వు అడవులుగా ప్రకటించింది. కొండ జాతుల ప్రజలు కుంకుళ్లు, చీపుళ్లు, చింతపండు, తేనె, విప్పపువ్వు తదితర అటవీ ఉత్పత్తులను స్వేచ్ఛగా సేకరించుకుని, అనుభవిస్తూ, అమ్ముకుంటూ జీవనం సాగించేవారు. బ్రిటిష్ ప్రభుత్వం దీన్ని నిషేధించింది. గిరిజనులు పొయ్యిలో కట్టెలు సైతం తెచ్చుకోకుండా చేసింది. గిరిజనులచే రోడ్లు, ఎగుమతులు, ఇతరపనులు తక్కువ కూలికి నిర్బంధంగా చేయించేది. వెట్టిచాకిరీ చేయించేది. చిత్రహింసల పాలు చేసింది. సామాజిక, ఆర్థిక, లైంగిక దోపిడీకి పాల్పడింది. గిరిజనుల బాధలు, కష్టాలు చూసి చలించిన సీతారామరాజు గిరిజనులతో మమేకమయ్యాడు. పోరాటానికి సన్నద్ధం చేశాడు. గిరిజనుల జీవన విధానంలో బ్రిటిష్ జోక్యాన్ని నిరసించాడు. గిరిజనుల అటవీ భూములపై ఇతరుల అజమాయిషీ పెరగడం, గిరిజనుల సాంప్రదాయాల పరాయికరణ ప్రయత్నాలకు ఎదురొడ్డి నిలిచాడు. గిరిజన స్వపరిపాలన వ్యవస్థ కోసం పోరాడాడు. విల్లంబులతో మాత్రమే పోరాడలేమని గ్రహించి పోలీసు స్టేషన్లపై 1922 ఆగస్టు 22, 23, 24 తేదీల్లో 500 మందితోపైగా గిరిజన విప్లవకారులతో గెరిల్లా తరహాలో దేవీపట్నం, చింతపల్లి, కృష్ణదేవిపేట, అన్నవరం, రాజవొమ్మంగి, రంపచోడవరం, పోలీసు స్టేషన్లకు ముందుగానే వస్తున్నట్లు హెచ్చరిక చేసి దాడులు చేశారు. తుపాకులు, ఇతర ఆయుధాల సేకరణ జరిగాయి. ప్రజలు అల్లూరి సీతారామరాజును, పోరాటవీరులను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. జాతీయ కాంగ్రెస్ ఈ పోరాటానికి సహకరించలేదు. పైగా వ్యతిరేకించింది. గాంధీ సైతం వ్యతిరేకించాడు. సీతారామరాజును దేశభక్తుడు అని కీర్తిస్తూనే తిరుగుబాటుదారుగా అభివర్ణించాడు. అమాయక గిరిజనులపై చిత్రహింసలను, గ్రామాల దహనాలను, మానభంగాలను, అణచివేత చూసి చలించిపోయిన సీతా రామరాజు గిరిజనుల ప్రాణ రక్షణ కోసం తనంతట తానుగానే లొంగిపోగా, 1924 మే 7న బ్రిటీషు అధికారి మేజర్ గుడాల్ దుర్మార్గంగా కాల్చి చంపాడు. మన్యం మూగబోయింది. మే 8న కృష్ణదేవిపేటలో దహనం చేశారు. 'అల్లూరి' అమరుడయ్యాడు. భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో వేగుచుక్క అయ్యాడు. 27 సంవత్సరాల చిన్నవయస్సులోనే స్వాతంత్ర్యం కోసం తుపాకీ గుండ్లకు తన గుండెనిచ్చి ప్రజల గుండెల్లో చిరంజీవిగా ఉన్నాడు. మన్యపోరాటం సంపూర్ణ విజయం సాధించకపోయినా స్వాతంత్ర్య సముపార్జనకు ఒక మెట్టుగా నిలచిందని పలువురు పరిశోధకులు పేర్కొన్నారు.

మన్యం నేడు..

నేటికీ గిరిజనుల స్థితిగతులు మారలేదు. గిరిజన ప్రాంతాలకు రోడ్లు, పథకాలు, ఇతర సౌకర్యాలు పైపైకి కనబడుతున్నా అధికశాతం గిరిజనుల స్థితిగతులు మరింతగా దిగజారుతున్నాయి. జీవనాధారమైన భూమి గిరిజనేతర భూస్వాములు బడాబాబులు అక్రమంగా అనుభవిస్తున్నారు. ప్రభుత్వం సైతం కార్పోరేట్ సేద్యం, మైనింగ్ పేరుతో అటవీ భూములను వేలు, లక్షల ఎకరాలు కార్పొరేట్ సంస్థలకు, బడాబాబులకు, విదేశీ సంస్థలకు కట్టబెడుతున్నాయి. ప్రాజెక్టుల పేరుతో వేల ఎకరాల భూమి, గిరిజన గ్రామాలు, అటవీ సంపద నాశనమౌతున్నాయి. పునరావాసం మాత్రం అగమ్యగోచరంగా ఉంది. 1/70 రక్షణ చట్టమున్నా అమలు అంతంత మాత్రంగానే ఉంది. ప్రభుత్వ అండతో స్వార్ధపరుల దాహానికి అడవి అంతరిస్తోంది. అటవీ ఉత్పత్తులు క్షీణిస్తున్నాయి. గిరిజనులు కష్టపడి సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులకు ధరలేక దోచుకోబడుతున్నారు. గిరిజన సహకార సంస్థ, ఐటిడిఎల వల్ల గిరిజనులకు జరుగుతున్న మేలు నేతిబీరకాయలో నెయ్యి చందంగా ఉంది. అంటురోగాలకు, జ్వరాలకు వేలమంది బలౌతున్నారు. వైద్య సౌకర్యాలు అందక ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో మైళ్ళ తరబడి డోలీమోతలే దర్శనమిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఆకలిచావులు ప్రతి సంవత్సరం సంభవిస్తున్నాయి. లైంగికంగా మోసగించబడుతున్నారు.

తిరిగి సామ్రాజ్యవాద ప్రమాదం

బ్రిటిష్ సామ్రాజ్యవాదులను దేశం నుంచి భౌతికంగా తరిమివేశాం. ప్రత్యక్ష పెత్తనం పోయింది. కాని తిరిగి ప్రపంచ వాణిజ్య సంస్థ, ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ పేరుతో సామ్రాజ్యవాద దేశాలు భారత్ లాంటి వర్ధమాన దేశాలు, నవ స్వతంత్ర దేశాలపై ఆర్థిక దోపిడీకి పూనుకుంటున్నాయి. ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రయివేటీకరణ విధానాలు ఈ దోపిడీకి సాధనంగా వినియోగించబడుతున్నాయి. వీటి పర్యవసానంగా సామాన్య ప్రజల స్థితిగతులు దిగజారుతున్నాయి. దేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక చిత్రపటం చిన్నాభిన్నమౌతోంది. విలువలు దిగజారుతున్నాయి. విచ్చలవిడి, అనైతిక సంస్కృతి విజృంభిస్తోంది. త్యాగం స్థానంలో స్వార్థపర అంశాలు ఆకాశానికి ఎత్తబడుతున్నాయి. అవినీతి, అక్రమ సంపాదనల్లో కొద్ది మంది సుఖమయ జీవనం గడుపుతుంటే అత్యధిక శాతం ప్రజలు జీవితాలు ఆకలి, దారిద్ర్యం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, రోగాలతో సామాజిక భద్రత లేక ఛిద్రమౌతున్నాయి. ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయి. బిజెపి, నరేంద్ర మోది దన్నుతో అదాని, అంబానీ లాంటి బడా కార్పోరేట్లు లక్షల కోట్లకు పడగలెత్తుతున్నారు. మహిళలు, దళితులు, గిరిజనులు, మైనార్టీలు అణచివేతకు గురౌతూనే ఉన్నారు. మతోన్మాదం పడగ విప్పి బుసకొడుతోంది. చిన్న వయస్సులోనే అల్లూరి, భగత్‌సింగ్, కన్నెగంటి హనుమంతు, కొమురం భీం, బిర్సాముండా, సోయం గంగులు లాంటి విప్లవవీరులు, వేలాది ప్రజల ప్రాణత్యాగం సామ్రాజ్యవాదులను దేశం నుంచి తరిమేసింది. కేంద్ర బిజెపి పాలకులు తమ విధానాలతో మరలా సామ్రాజ్యవాదులను ఎర్ర తివాచిపర్చి స్వాగతించడం ఎంత సిగ్గు చేటు! ఈ విధానాలకు వ్యతిరేకంగా అందరం నిలబడాలి, పోరాడాలి. ముఖ్యంగా స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాలి. త్యాగధనుల స్ఫూర్తిని యువజనులు, విద్యార్థులు పొందాలి. అల్లూరి, భగత్‌సింగ్ లాంటి రియల్ హీరోలకు(రీల్‌హీరోలకు కాదు) వారసులుగా నిలబడాలి. స్వాతంత్ర్యాన్ని తాకట్టు పెడుతున్న పాలకుల విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి. ప్రపంచానికి, దేశానికి ప్రమాదకరంగా తయారై బుసలు కొడుతున్న సామ్రాజ్యవాదానికి, మతోన్మాదానికి, బడా కార్పోరేట్ల దోపిడీకి వ్యతిరేకంగా అల్లూరి స్ఫూర్తితో పోరాడాలి. స్వేచ్ఛ, ఆర్థిక అసమానతలులేని సమాజం కోసం, సమానత్వం కోసం పోరాడి ప్రాణాలర్పించిన విప్లవవీరుడు అల్లూరి అందరివాడు. అల్లూరికి ఘనమైన నివాళి అర్పించడమంటే ఆయన ఆశయ సాధనకు కృషిచేయడమే.

బి.బలరాం, ఎబిఎస్‌వికె ట్రస్ట్ ఛైర్మన్

ఘనంగా మెకానిక్స్ డే

ప్రజాశక్తి - మొగల్తూరు

నూతన వరవడిని అందుకుని ఆర్థికంగా బలపడాలని మోటార్ సైకిల్ మెకానిక్ సంఘ సభ్యులకు ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ సూచించారు. బుధవారం ప్రపంచ మెకానిక్ డేను మొగల్తూరులోని బండి ముత్యాలమ్మ మోటార్ సైకిల్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ద్విచక్ర వాహనాలతో ప్రదర్శన చేశారు. ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు ఏర్పాటు చేసిన కేకును నాయకర్ కోసి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వస్తున్న నూతన టెక్నాలజీపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సంఘ సభ్యులు నాయకర్‌కు అందజేసి, అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వీరవల్లి రమేష్, ఎంవి.విఎస్.ముత్యాలరావు, ఎ.సురేష్, దొంగ శ్రీను, డి.రాంబాబు ఉన్నారు.

భీమవరం టౌన్: ఒక మెకానిక్ ఒక ఇంజనీర్‌తో సమానమని, ఎంతో ఆలోచన శక్తి ఉన్న వ్యక్తులు మెకానిక్‌లేనని ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. ప్రపంచ మెకానిక్స్ డే కార్యక్రమాన్ని మోటార్ సైకిల్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కిషోర్ థియేటర్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎల్‌ఎ అంజిబాబు పాల్గొని మాట్లాడారు. బుధవారం ఎంతో ఆలోచనలతో, సరికొత్త ప్రయోగాలు చేసే వాళ్లే మెకానిక్స్‌లని, అటువంటి వారు ఇప్పుడు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు భవనం నిర్మాణానికి సహకారం అందించాలని వినతి పత్రాన్ని అందించారు. ఎఎంసి మాజీ ఛైర్మన్ చిలుకూరి నరసింహరాజు భవన నిర్మాణానికి రూ.50 వేలు అందిస్తామని ఎంఎల్‌ఎ అంజిబాబుకు తెలిపారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు చెన్నమల చంద్రశేఖర్, ఎఎంసి మాజీ ఛైర్మన్లు కోళ్ల నాగేశ్వరరావు, ఇందుకూరి రామలింగరాజు, చిలుకూరి నరసింహరాజు పాల్గొన్నారు.

నరసాపురం: పట్టణంలోని రాజగోపాలస్వామి ఆలయంలో బుధవారం మెకానిక్ డే నిర్వహించారు. కృషి టూ వీలర్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు ముఖ్య అతిథిగా నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ హాజరయ్యారు. జనసేన కార్యాలయం నుంచి మెకానిక్స్‌తో కలిసి ర్యాలీగా నాయకర్ రాజగోపాలస్వామి గుడికి వచ్చారు. అనంతరం నాయకర్ కేక్ కట్ చేశారు. నాయకర్ మెకానిక్స్‌కు మెకానిక్ డే శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆకివీడు : మోటార్ సైకిల్ మెకానిక్‌లు నిజాయితీతో మరింత ముందుకెళ్లగలుగుతారని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణ రాజు అన్నారు. అంతర్జాతీయ మెకానిక్ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక మెకానికల్ అసోసియేషన్ సంబరాలు నిర్వహించుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా మెకానిక్ రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సత్యనారాయణ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మెకానిక్ సంఘ అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ఆటోమొబైల్ షాప్ యజమానులను సంఘ సభ్యులు సన్మానించారు.

ఉండి: మండల కేంద్రమైన ఉండిలో అంతర్జాతీయ మెకానిక్ డే ఉత్సవాలు మోటర్ సైకిల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉండి మండల అధ్యక్షులు బొర్రా ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఆకుల గోపాలకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ఉపాధ్యక్షులు మాట్లాడారు. సంఘ కోశాధికారి ముంగండ శ్రీనివాసరావు, కార్యదర్శి ఆకుల సతీష్ పాల్గొన్నారు.

పంట కాలువలో పూడిక తీత

కాళ్ల: ఏలూరుపాడు నెంబర్-2 ఛానల్‌లో పూడికతీత పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయని గ్రామ కార్యదర్శి ఎస్.అరుణాదేవి అన్నారు. ఏలూరుపాడు గ్రామంలో ఉన్న నాగులకోడు మంచినీటి చెరువులోకి పూర్తిస్థాయి నీటిని నింపాల్సి ఉందన్నారు. ఏలూరుపాడు నెంబర్-2 ఛానల్ పూడుకుపోవడంతో పాటు ఆక్రమణలతో ఉందన్నారు. నీటి ప్రవాహం సక్రమంగా రావడం లేదు. రెండు కిలోమీటర్ల పొడవునా పంట కాలువ అస్తవ్యస్తంగా ఉంది. గ్రామ సర్పంచి భూపతి రాజు జగ్గరాజు ఆధ్వర్యంలో పంటకాలువ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. నాగులకోడు మంచినీటి చెరువు అవుట్ లెట్, ఇన్లెట్ ఈ పంట కాలువలోనే ఉన్నాయి. 15వ ఆర్థిక సంఘం, పంచాయతీ నిధులతో వంటకాల అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఇంకా నాలుగు రోజుల్లో ఈ పనులు పూర్తవుతుందని, మంచినీటి చెరువును పూర్తిస్థాయిలో నింపుతామని గ్రామ కార్యదర్శి ఎస్.అరుణాదేవి తెలిపారు.

అర్ధవరంలో డెంగీ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ

గణపవరం: మండలంలోని అర్ధవరం గ్రామంలో బుధవారం గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డెంగీ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్ బాబు మాట్లాడుతూ డెంగీ నివారణకు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. నెలరోజుల పాటు గ్రామాల్లో స్థానికులకు డెంగీ వ్యాధి నివారణకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సిబ్బంది పాల్గొన్నారు.

జల్లి సత్యనారాయణ అమరజీవి

యలమంచిలి: తమ కోసం, తమ కుటుంబం కోసం మాత్రమే కాకుండా ప్రజల కోసం జీవించేవారు సమాజంలో అరుదుగా ఉంటారని అటువంటి కోవకు చెందిన జల్లి సత్యనారాయణ అమరజీవిగా నిలుస్తారని సిపిఎం నేత బాతిరెడ్డి జార్జి అన్నారు. ఇటీవల అనారోగ్య కారణాలతో మృతిచెందిన మండలంలోని కాంబొట్లపాలెం గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు జల్లి సత్యనారాయణ సంతాప సభ బుధవారం కాంబొట్లపాలెంలోని సత్యనారాయణ స్వగృహం వద్ద నిర్వహించారు. కార్యక్రమంలో సత్యనారాయణ కుమార్తె మహాలక్ష్మి, గ్రామ మాజీ సర్పంచి పల్లి జార్జి బాబు పాల్గొన్నారు,

వస్త్ర సంచుల పంపిణీ

నరసాపురం: స్థానిక వైఎన్ కళాశాల సామాజిక సేవా కేంద్రం ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం ఘనంగా నిర్వహించి ప్రజలకు వస్త్ర సంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతపల్లి కనకారావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణ కాలుష్యము బాగా పెరిగి, వాతావరణంలో అనేక మార్పులు జరిగి ఎల్‌నినో ప్రభావానికి లోనవుతుందన్నారు. భూ గర్భమంతా పాడైపోతుందని, ప్రతీ ఒక్కరూ ప్లాస్టిక్ కవర్లను వాడకుండా వస్త్ర సంచులను వాడాలని తెలిపారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా బ్రహ్మారెడ్డి

ఉండి: ఉండి లయన్స్ క్లబ్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజులను ఎన్నుకున్నట్లు ఆ క్లబ్ అధ్యక్ష వేగేశ్న అనంత లక్ష్మి, కన్నె గంటి రూత్ కళ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కార్యవర్గంలో చేపట్టిన సేవా కార్యక్రమాల నిర్వహణకు సహకరించిన సభ్యులకు, దాతలకు, పత్రికాప్రతినిధులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రజలకు రుణపడి ఉంటా : పితాని

పెనుమంట్ర: అఖండ విజయాన్ని చేకూర్చిన ప్రజలకు సర్వదా రుణపడి ఉంటానని మాజీ మంత్రి, ఆచంట నియోజకవర్గ ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ అన్నారు. మంగళవారం రాత్రి జరిగిన మాముడూరు, పొలమూరు, పివి పాలెం, జుత్తిగ మల్లిపూడి, ఎస్‌ఇ పర్రు, నత్తా రామేశ్వరం, పెనుమంట్ర గరువు, భట్లమగుటూరు, ఆలమూరు, ఓడూరు, నేలమూరు గ్రామాల్లో సార్వత్రిక ఎన్నికలల్లో అఖండ విజయాన్ని చేకూర్చిన ప్రజలకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతూ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తణుకు వారి కోర్టులో
ఈ.పి. నెం. 31/2023 ఇన్ ఓ.యస్. నెం. 335/2021

బిట్వీన్:
పుట్టా మురళీ రామకృష్ణ -డి. హెచ్. ఆర్.
మరియు
కవురు సుధాకర్ -జె. డి. ఆర్.
తండ్రి: లేటు సత్యనారాయణ, డోర్ నెం. 22-71, ప్రకాశం రోడ్, అంబేద్కర్ కాలనీ, వేల్పూరు - 534222, తణుకు మండలం, ప॥గో॥జిల్లా, తణుకు 4వ అదనపు జిల్లా జడ్జి కోర్టు.

డిహెచ్ఆర్ తరపున దాఖలు చేసిన ప్రకటన

పై నెంబరు ఈ.పి. బాకీ రూ. 1,79,456/-లు దర్మిలా వడ్డీ ఖర్చులు వసూలుకు, వేల్పూరులో మీ 130 చ॥గ॥ల స్థలం అందులో డోర్ నెం. 22-71 రు ఇల్లు జప్తు, వేలం కోరుచూ దాఖలు చేయగా మీరు నోటీసులు అందుకొనకపోవుటచే శ్రీ కోర్టు వారు మీకు పేపరు ప్రకటన ద్వారా నోటీసు ఆర్డరు వేసినారు. కావున మీరు ఈ ప్రకటన తేది నుండి 30 రోజుల లోపుగా శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అవ్వక తప్పిపోయిన ఎడల ఈ.పి. మీ పరోక్షము నందు తీర్మానం జరుగునని తెలియజేయడమైనది.
పబ్లికేషన్ దాఖలుకు వాయిదా తేది: 29-07-2024

శ్రీ గోటేటి భాస్కరమూర్తి
తణుకు శ్రీ గోటేటి సత్య వెంకట వరప్రసాద్
ది.29-6-2024 అడ్వకేట్స్, తణుకు

మహారాజశ్రీ రెండవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు, తణుకు
O.S. No. 228/2022

Between:
లంగళం శ్రీను -వాది
మరియు
1వ ప్రతివాది:
బోడపాటి రామకృష్ణ, తండ్రి: వెంకటేశ్వరరావు
2వ ప్రతివాది:
బోడపాటి సూర్యకళ్యాణి, భర్త: రామకృష్ణ, పొలమూరు, పెనుమంట్ర మండలం, ప॥గో॥జిల్లా 534238.

వాది తరపున చేసిన ప్రకటన

పై నంబరు దావాలో ప్రతివాదులైన మీకు శ్రీ కోర్టు వారు జారీ చేసిన సమన్లు అమలు కానందున ఈ ప్రకటన ద్వారా ప్రతివాదులైన మీరు **ది. 26-07-2024వ తేదీన ఉదయం గం॥ 10.30లకు** శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా గాని, అడ్వకేటు ద్వారా గాని హాజరై వాది చేసిన దావాపై అభ్యంతరములు తెలియచేయనిచో ప్రతివాదులైన మీకు వ్యతిరేకముగా ఏక్సపార్టీ చేసి తదుపరి చర్యలు శ్రీ కోర్టు వారు తీసుకొందురని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

యామజాల సత్యనారాయణమూర్తి
తణుకు అడ్వకేటు, పొలమూరు, ప॥గో॥జిల్లా
04-6-2024 సెల్: 9849919010

ప్రకటన
మహారాజశ్రీ భీమవరం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) భీమవరం, ప॥గో॥జిల్లా వారి కోర్టులో
O.S. No. 289/2008

Between:
వాది: వావిలాల విజయలక్ష్మి
Vs
ప్రతివాదులు: వావిలాల లక్ష్మీకాంతం మరియు వగైరాలు

4వ ప్రతివాది: బేత ఇందిరదేవి, W/o. కృష్ణ, గుడ్డిగూడెం, గోపాలపురం మండలం, తూ॥గో॥జిల్లా.

5వ ప్రతివాది: మోటుపల్లి నాగ వెంకట లక్ష్మణరావు, S/o. రామారావు, మాదివాడ, ఆకివీడు మండలం, ప॥గో॥జిల్లా.

పై నెంబరు దావాలో 4వ ప్రతివాది బేత ఇందిరాదేవి మరియు 5వ ప్రతివాది మోటుపల్లి నాగ వెంకట లక్ష్మణరావు గార్లకు అనేక పర్యాయములు శ్రీ కోర్టు వారి ద్వారా సమన్లు పంపించినప్పటికి అందుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారము పై 4, 5 ప్రతివాదులకు **ది. 30-07-2024వ సం॥ తేదీన ఉదయం 10.30 గం॥లకు** స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై తమ ఆక్షేపణలు తెలియపర్చుకొనవలెను. అట్లు కాని ఎడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమందు తీర్మానించబడునని ఈ ప్రకటన ద్వారా తెలియపర్చడమైనది.

(By Order)
కూనపరాజు గోపాలకృష్ణంరాజు
ప్రాంతం: భీమవరం వాది తరపు అడ్వకేట్
తేది:03-07-2024 భీమవరం

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టులో, తాడేపల్లిగూడెం
I.A. 584/23, O.S. 80/2016

Between:
భీముని వెంకటరమణ, వగైరాలు -పిటీషనర్స్
మరియు
కరణం అప్పారావు వగైరాలు -రెస్పాండెంట్స్

R-8: భీముని వెంకటరమణ, W/o. లేటు వెంకటరమణ, వయస్సు 72 సం॥లు, H/o. గాదంసెట్టి సత్యనారాయణ, ఫ్లాట్ నెం.1, 24వ వార్డు, ఇండియన్ గ్యాస్ కంపెనీ రోడ్డు, తాడేపల్లిగూడెం.

R-13: భీముని వరప్రసాద్, S/o. వెంకటరమణ, వయస్సు 52 సం॥లు, H/o. గాదంసెట్టి సత్యనారాయణ, ఫ్లాట్ నెం.1, 24వ వార్డు, ఇండియన్ గ్యాస్ కంపెనీ రోడ్డు, తాడేపల్లిగూడెం.

పై నెంబరు గల పిటిషన్‌లో పిటిషనర్, రెస్పాండెంట్స్ అయిన మీరు R8, R13 కి ఎన్నిమార్లు పిటిషన్ నోటీసులు మీకు పంపిన అమలు కాని కారణంగా శ్రీ కోర్టు వారు ఆర్డరు ప్రకారం మీకు పిటిషన్ నోటీసులు పత్రికా ప్రకటన ద్వారా మీకు అమలుచేసే విధముగా పిటిషనర్ ఆర్డరు పొంది ఉన్నారు. కావున **వాయిదా తేది 12-7-2024 ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారు ఎదుట స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరు కాగలరు. లేనిచో మీ పరోక్షమందు పిటిషన్ తదుపరి చర్యలు జరుపబడును.
వాయిదా తేది: 12-7-2024

జి.వి.నాగేశ్వరరావు
జి.లక్ష్మయ్య
యమ్.శ్రీనుబాబు
తాడేపల్లిగూడెం న్యాయవాదులు, ఏలూరు

CHANGE OF NAME

I, VALLURI VENKATESWARA RAO, S/o. Krishnamurthi, resident of D.No. 3-8, NTR Center, Prathipadu Village, Pentapadu Mandalam, West Godavari - 534146. Have changed my name from **VALLURI VENKATESWARLU** (As per Passport) (Old Name) to **VALLURI VENKATESARA RAO** (As per Aadhar) (New Name). Hence after all my documents (Passport etc.) and correspondence will continue with my new name **VALLURI VENKATESARA RAO.**

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, ఇరగవరం మండలం, కంతేరు గ్రామానికి చెందిన దంపనబోయిన కృష్ణవేణి (పాస్‌పోర్టు నెం.X5981984) జిరాక్స్ నిమిత్తం ఇరగవరం ఈ సేవ కేంద్రం వద్ద నుండి కంతేరు వెళ్ళుతుండగా మార్గ మధ్యలో పడిపోయనది. దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

దంపనబోయిన కృష్ణవేణి
C/o.శ్రీనివాసరావు, డోరునెం.1-54,
కంతేరు, ఇరగవరం మండలం.
పిన్ : 534126, సెల్: 9010709985

పాస్‌పోర్టు పోయినది

బాడిత ఏసుబాబు తండ్రి : సుబ్బారావు అను నేను నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. ఇంటి దగ్గర నుండి జిరాక్స్ సెంటర్ కు వెళుతుండగా నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. పాస్పోర్ట్ నెంబర్ : **W2690420** గల పాస్పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

బాడిత ఏసుబాబు, తండ్రి : సుబ్బారావు
డోర్ నెం : 1 - 77, ఆలమూరు
పెనుమంట్ర మండలం, ప.గో.జిల్లా
సెల్ : 7337455193

CHANGE OF NAME

I **Yerramsetti Bujji** holder of Indian passport No.N2792045, Daughter of Yerramsetti Venkateswara Rao domiciled at 2-146 Turingpeta, Narayanapuram, Unguturu, West Godavari District - 534407, Andhra Pradesh, India intend to change my name from **Vempala Sandhyarani** for all practical purpose any objection towards my name change may please

contact. 9848697738

ఐడెంటి కార్డు కలిగిన పర్సు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, ఆచంట మండలం, వల్లూరు పంచాయతీ పరిధి నీరుల్లిపాలెం గ్రామానికి చెందిన చెల్లెం రాజేంద్రప్రసాద్ S/o. మోహన్‌రావు కు చెందిన ఒరిజినల్ సివిల్ ఐడి కార్డ్స్ కలిగిన పర్సు పడిపోయినది. 13-6-2024 తేదీ గురువారం ఉదయం 10:30 కు నీరుల్లిపాలెం నుంచి ఆచంట మోటార్ సైకిల్‌పై వస్తుండగా ప్యాంట్ జేబులో నుంచి పరసు జారి పడిపోయినది. వాటిలో రాజేంద్రప్రసాద్‌కు ఒరిజినల్ సివిల్ ఐడి కార్డ్ నెంబర్ 283052002625, భార్య బ్యూలా చెల్లెం ఒరిజినల్ సివిల్ ఐడి కార్డ్ నెంబర్ 285052306871, కుమారుడు జబేజ్ జాస్పర్ చెల్లెం, ఒరిజినల్ సివిల్ ఐడి కార్డ్ 320012002612 కువైట్ స్టేట్ ఇష్యూస్ చేసిన ఐడెంటి కార్డులు కలిగిన పర్సు పడిపోయినది కావున ఎవరికైనా దొరికింది ఈ క్రింది అడ్రస్ కు సంప్రదించగలరు.

అడ్రస్: చెల్లెం రాజేంద్రప్రసాద్
S/o. మోహన్ రావు. డోర్ నెంబర్ 10-46, నీరుల్లిపాలెం,
వల్లూరు, ఆచంట మండలం పశ్చిమగోదావరి జిల్లా.
పిన్ కోడ్ 534269, సెల్: 7995074634